

151 వ భాగం

త్రిపురాసుర సంహారం - 1

ఏ పురాణం చూసినా ఏ దేవత/దేవుడి మీద ఆ పురాణం రాసారో వారి లక్షణాలు బాగా ఎత్తి చూపుతూ మిగతా దేవతల గురించి చూచాయగా మాత్రమే చెప్పడం గమనించవచ్చు. భాగవతం విష్ణు కథ కనక ఇందులో శివుడి మీద వర్ణన తక్కువగా ఉంటుంది, కావాల్సిన చోట తప్ప. ఈ భాగవతంలో కనిపించే త్రిపురాసుర సంహారం కథ మొదలుపెట్టే ముందు ఏమైందో చిన్న కథ చూద్దాం. నారదుడు ధర్మరాజు రాజసూయం చేసేటపుడు వచ్చాడు యజ్ఞం చూడ్డానికి. అక్కడ కృష్ణుడు శిశుపాలుణ్ణి చంపాక శిశుపాలుడి శరీరంలోంచి వచ్చిన జ్వాల కృష్ణుడిలో కలిస్తే ఆశ్చర్యంగా అడుగుతాడు ధర్మరాజు – వీడేమిటి ప్రతీరోజూ కృష్ణుణ్ణి తిడుతూ బతికాడు అయినా పోయినప్పుడు కైవల్యం ఎలా వచ్చింది ఇతనికి? ఈ ప్రశ్నకి సమాధానం చెప్తున్నాడు నారదుడు.

శా. కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా
సామాగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్,
ప్రేమన్ మీరలు, భక్తి నేము, నిదె చక్రింగంటి; మెట్లైన ను
ద్ధామ ధ్యానగరిష్ఠ మైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా! [7-18]

భగవంతుణ్ణి ఎలా తల్చుకుంటున్నాం అనేది అనవసరం, అది లెక్కలోకి రాదు. కోరికలతో గోపికలూ, చావు భయంతో కంసుడూ, వైరంతో శిశుపాలుడితో పాటు మిగతా రాజులూ (నృపతులు). వృష్ణి వంశంలో అందరూ బంధుత్వంతోనూ, బంధు ప్రేమతో మీరు, భక్తితో మేము (నారదుడితోపాటు మిగతా యోగులందరూ) అందరం కూడా విష్ణువుని నిరంతరం తల్చుకుంటూ ఉన్నాం. అలా మనసులో భగవంతుణ్ణి తల్చుకుంటూ ఆయన్ని చేరుకోవచ్చు. ఎలా తల్చుకుంటున్నాం అనేది అనవసరం. అయితే కృష్ణుడి సంగతి చూద్దాం ఇక్కడ.

మ. జలజాతప్రభవాదులున్ మనములోఁ జర్చించి భాషావళిం
బలుకన్ లేని జనార్దనాహ్వయ పరబ్రహ్మంబు నీ యింటిలోఁ
జెలి యై మేనమఱంది యై సచివుఁడై చిత్తప్రియుండై మహా
ఫలసంధాయకుఁడై చరించు టది నీ భాగ్యంబు రాజోత్తమా! [7-386]

భగవంతుడంటే ఎటువంటివాడు? ఆయన్ని ఎవరూ మనసుతో చూసి, నోటితో వివరించి చెప్పలేరు. భగవంతుడు అనంతుడు అన్నీ తెల్సినవాడు అనుకుంటే ఏదో కాస్త మిడి మిడి జ్ఞానం ఉన్న మనం అనంతం అంటే – అంతం లేనిదాన్ని – వివరిండం ఎలా సాధ్యం? బ్రహ్మ (జలజాత ప్రభవుడు; జలజాత – నీటిలో పుట్టినది; పద్మం, అందులో ప్రభవించిన వాడు) వంటి వారికే మనసులో చర్చించి నోటితో ఇదీ అని చెప్పలేనటువంటి పరబ్రహ్మ స్వరూపుడు ఈ జనార్దనుడు. అటువంటివాడు నీ ఇంట్లో నీ స్నేహితుడిగా (చెలియై), మేనమామ కొడుకుగా (మేనమఱంది), మనసుకి సంతోషం కలిగించేవాడిగా, అన్ని ఫలాలు నీకు ఇచ్చేవాడిగా నీ ఇంట్లో సంచరిస్తున్నాడు. ఇంతకంటే నీకు కావాల్సినదేముంది?

క. బహుమాయుఁడైన మయుచే
విహతం బగు హరుని యశము విఖ్యాత జయా
వహముగ నీ భగవంతుఁడు
మహితాత్ముఁడు మున్నొనర్చె మనుజవరేణ్యా! [7-387]

అంతేనా, అనేకానేక మాయలు తెల్సిన మయుడిచేత నిర్మించబడిన త్రిపురాలవల్ల శివుడి యశస్సుకి మచ్చ (విహతాంబగు హరుని యశము) కలిగింది. దాన్ని హరించడానికి ముందు ఒకప్పుడు ఈ విష్ణువు తోడ్పడ్డాడు. చెప్పేది ఏమిటంటే మనలాంటి మనుషులకే కాదు, సాక్షాత్తు శివుడికే సహాయం చేయగల్గిన వాడు విష్ణువు. దానికి ఆశ్చర్యంవేసిన యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు.

క. ఏ కర్మంబున విభుఁడగు
శ్రీకంఠుని యశము మయునిచే సుడివడియెన్
వైకుంఠుఁ డెవ్విధంబునఁ
గైకొని తత్కీర్తి చక్కఁగా నొనరించెన్. [7-389]

ఏ కర్మ వశం చేత ప్రభువు అయిన (విభుడగు) శ్రీకంఠుడి యశస్సుకి మయుడిచేత భంగం (సుడివడియెన్) కలిగింది? దాన్ని ఈ వైకుంఠుడు ఎలా తొలగించాడు? ఈ పద్యంలో శివుణ్ణి పోతన ఏమన్నాడో గమనించారా? శ్రీ కంఠుడు – కంఠంలో వన్నె కలవాడు. లేదా శ్రీ అంటే విషం. కంఠంలో హాలాహలం అనే విషం ఉన్నవాడు (లేదా లోకాలని హతమార్చబోయే) విషాన్ని హరించి శోభాకరమైన కంఠం ఉన్నవాడు. ప్రాస కోసం విష్ణువుని ఏమన్నాడు? వైకుంఠుడు – కుంఠత్వము, మొక్కపోవుట అనేది లేనివాడు లేదా వైకుంఠంలో నివాసం ఉండేవాడు.

క. చక్రాయుధ బలయుతు లగు
శక్రాదుల కోహటించి శ్రమమున నసురుల్
సక్రోధంబున నరిగిరి
విక్రమములు మాని మయుని వెనుకకు నధిపా! [7-391]

దీనికి నారదుడి సమాధానం చూద్దాం. చక్రాయుధుడి (విష్ణువు) బలం చూసుకున్న దేవతలు, ఇంద్రుడి (శక్రాదులు, శక్ర – దుష్టులు; లేదా దుష్టులని సంహరించేవాడు, ఇంద్రుడు) చేతులలో ఓడిపోయిన (ఓహటించి) అసురులు క్రోధంతో పారిపోయి, యుద్ధం మానుకుని (విక్రమములు మాని), మయాసురుడు అనేవాడి వెనక్కి చేరుకున్నారు. నాలుగు పాదాలలో మొదటి పదాల్లో ప్రాస గమనించారా? (చక్రాయుధ, శక్రాదుల, సక్రోధంబున, విక్రమములు).

వ. ఇట్లు రక్కసులు దన వెనుకఁ జొచ్చిన మాయానిలయుండును దుర్జయుండును నైన మయుండు దన విద్యాబలంబున నయోరజత సువర్ణమయంబులై యెవ్వరికిని లక్షింపరాని గమనాగమనంబులును వితర్కింపరాని కర్కశపరిచ్ఛదంబులును గలిగిన త్రిపురంబుల నిర్మించి యిచ్చిన, నక్తంచరు లందఱు నందుంబ్రవేశించి కామసంచారులై పూర్వవైరంబుఁ దలంచి సనాయకంబు లయిన లోకంబుల నస్తోకంబయిన నిజబలాతిరేకంబున శోకంబు నొందించిన. [7-392]

మాయాసురుడు (మాయానిలయుండు), చెడ్డనీతి కలవాడు (దుర్జయుండు) కదా, అందువల్ల తన మాయలతో, విద్యలతో ఇనుము (అయస్), వెండి (రజత), బంగారు (సువర్ణ) త్రిపురాలని నిర్మించి ఇచ్చాడు (నయోరజత

సువర్ణమయంబులై). అవి ఎలాంటివంటే ఎవరూ లెక్కపెట్టలేని గమనం కలవి (లక్షింపరాని గమనాగమనంబులు), ఆలోచనకే అందని కఠిన రక్షాకవచాలు కలిగినవి (కర్కశపరిచ్ఛదంబులును). వీటిలో సంచరిస్తూ రాక్షసులు (నక్తంచరులు, రాత్రిపూట తిరిగేవారు) పూర్వం జరిగిన అన్యాయాలు తల్చుకుని చెప్పలేనంత ఎక్కువగా (అస్తోకంబైన) తమ నిజ బలంతో అతిశయంతో (అతిరేకంబున) లోకాలని కష్టాలు పెట్టడం మొదలుపెట్టారు మరోసారి. ఇదేకదా జరిగేది సాధారణంగా ప్రపంచంలో? ఒక దేశం మరో దేశం మీద దండెత్తిందనుకోండి. ఓడిపోయిన దేశం కొంతకాలం స్థబ్దుగా ఊరుకున్నా వాళ్ళ ప్రయత్నాలు చేస్తూ అదను చూసుకుని మరోసారి దాడిచేస్తారు. జనం ఎలా ఛస్తే ఎవరిక్కావాలి?

క. లోకాధినాథు లెల్లను
శోకాతురు లగుచు శరణు జొచ్చిరి దుష్టా
నీక విదళనాకుంఠున్
శ్రీకంఠున్ భువనభరణ చిత్తోత్కంఠున్. [7-393]

ఇక్కడనుంచి శివుడి మహాత్యం కనక పోతనలో శివభక్తుడి బయటకి రావడం పద్యాల్లో చూస్తాం.
ఈ కష్టాలకి భరించలేక దేవతలందరూ (లోకాధినాథులు – లోకపాలకులు), ఏడుస్తూ (శోకాతురులగుచు) శరణు వేడారు శివుణ్ణి. ఈ శ్రీకంఠుడెటువాడంటే – రాక్షస (దుష్ట), సైన్యం (అనీకం) అణిచివేయగలవాడు (విదళనాకుంఠుడు), భువనాలని రక్షించడానికి (భువన భరణ) మనసు కలవాడు (చిత్తోత్కంఠుడు).

క. త్రిపురాలయు లగు దానవు
లపరాజితు లగుచు మాకు నశ్రాంతంబున్
వపురాదిపీడఁ జేసెద
రపరాధికులను వధింపు మగజాధీశా! [7-395]

హాలాహలం పుట్టినప్పుడు వెళ్ళి అడిగినట్టే ఇప్పుడు కూడా అడుగుతున్నారు. త్రిపురాలని ఆక్రమించుకున్న ఈ దానవులు పరాజితులు కాకుండా (అపరాజితులగుచు) మాకు ఎప్పుడూ (అశ్రాంతంబున) శరీరాది (వపుర – శరీరం),

పీడలు కలుగజేస్తున్నారు. వీరిని వధించాలి పార్వతీ నాథా. ఈ పద్యంలో అగజాధీశా అంటే అగజ – పర్వతుని కూతురైన పార్వతి, అధీశుడు (భర్త).

క. దీనులము గాక యుష్మద
ధీనులమై యుండు మేము దేవాహిత దో
ర్లీనుల మైనారము బల
హీనుల మగు మమ్ముఁ గావు మీశాన! శివా! [7-396]

ప్రస్తుతం దీనులం అయిపోయాం. మీకు (యుష్మద్) అధీనులమై ఉండే మమ్మల్ని రాక్షసులు (దేవాహిత – దేవతలకి అహితులు, హితులు కానివారు) భుజబలానికి (దోః – భుజబలం) లీనులము (అధీనం) అయ్యాము. ప్రస్తుతం అలా బలహీనులం అయ్యాం కనక మమ్మల్ని రక్షించాలి.

వ. అనిన భక్తవత్సలుం డగు పరమేశ్వరుండు శరణాగతు లైన గీర్వాణుల వెఱవకుం డని దుర్వారబలంబున బాణాసనంబుఁ గేల నందికొని యొక్క దివ్యబాణంబు సంధించి త్రిపురంబులపయి నేసిన మార్తాండమండలంబున వెలువడు మయూఖజాలంబుల చందంబునఁ దద్బాణంబువలన దేదీప్యమానంబులై యనేక బాణసహస్రంబులు సంభవించి భూ నభోంతరాళంబులు నిండి మండి తెప్పలుగాఁ గుప్పలు గొని త్రిపురంబుల పయిఁ గప్పె; నప్పుడు తద్బాణపావక హేతిసందోహ దందహ్యమాను లై గతాసు లయిన త్రిపురపుర నివాసులం దెచ్చి మహాయోగి యైన మయుండు సిద్ధరసకూపంబున వైచిన. [7-397]

సరే మీరు భయపడకండి (వెరవకుండు) అని శరణుజొచ్చిన దేవతలకి అభయం ఇచ్చి, వారింప శక్యంకాని (దుర్వారబలంబు) బాణాలని పట్టుకుని ఒక దివ్యమైన బాణం వేసాడు త్రిపురాలమీద. ఆ బాణంలోంచి సూర్యమండలంలోంచి (మార్తాండమండలంబున) వచ్చే కాంతికిరణాల్లా (మయూఖజాలంబుల చందంబున) వేలాదివేల బాణాలు బయటకొచ్చి (బాణసహస్రంబులు సంభవించి), భువనాలు అన్నీ కప్పేసాయి త్రిపురాలపైన. మయుడు ఊరుకుంటాడా? ఈ బాణాలవల్ల దెబ్బతిన్న త్రిపురాలలో ఉండే వార్ని (త్రిపురపుర నివాసుల) తీసుకొచ్చి సిద్ధరసం ఉన్న బావి (కూపం) లో దాచాడు. ఈ సిద్ధరస కూపం అంటే అమృతం ఉండేది. దానివల్ల చావు రాదని ఊహ. వచ్చే నెల వ్యాసంలో ఈ సిద్ధరసం వల్ల ఏమౌతుందో, విష్ణువు ఏం చేసాడో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS